# ప్రజలకు అందుబాటులో ఉండాలి

కొల్చారం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మంజుల

కొల్చారం(నర్సాపూర్): అధికారులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించే చూడాలని కొల్చారం ఎంపీపీ మంజుల అన్నారు. గురువారం కొల్చారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. మొదటి సమావేశానికి ఎమ్మెల్యే హాజరవుతారన్న సమాచారం ఉండడం, చివరి నిమిషంలో ఎమ్మెల్యే రావడం లేదన్న సమాచారంతో ప్రధాన అంశాలు చర్చకు రాకుండానే సమావేశాన్ని గంటలోనే ముగించేశారు. సమావేశాన్ని ఉద్దేశించి వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఎనగండ్ల గ్రామ సర్పంచ్ వీరారెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో నిందిరానగర్ కాలనీలో ఏడాదిన్నర నుంచి ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కిష్టాపూర్ సర్పంచ్ గోదావరి మాట్లాడుతూ.. గ్రామంల్లో పారిశుధ్య పనులు సజావుగా సాగుతున్న కార్మికులకు సంబంధించి మూడు నెలల వేతనాలు అందకపోవడం, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వారి వేతనాలు అందేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లును విడుదల చేయాలని సభ్యులు కోరారు.



కిష్టాపూర్ సర్పంచ్ గోదావరిని సన్మానిస్తున్న సభ్యులు, అధికారులు

దీనిపై స్పందించిన ఎంపీపీ జిల్లా కలెక్టర్ ఈ విషయంలో చొరవ చూపి పారిశుధ్య కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేసేలా చూడాలంటూ సభ్యుల తరఫున కోరారు. వేసవికాలం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేలా ప్రజాప్రతినిధుల సహకారంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈ ఏడాదికి గాను స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ లేని రుణాల మంజూరు పత్రాలను సంఘాల సభ్యులకు అందజేశారు. ఇటీవల జాతీయ స్థాయి మహిళా సాధికారత అన్న అంశంలో అవార్డు పొందిన కిష్టాపూర్ సర్పంచ్ గోదావరిని సభ్యులు సమావేశంలో సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రావు, సంబంధిత శాఖల అధికారులు, ప్రాదేశిక సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

ఏబీవీపీ నగర కార్యదర్శి భాను ప్రసాద్

మెదక్‌జోన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏబీవీపీ నగర కార్యదర్శి భాను ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం ఏబీవీపీ మెదక్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను స్థానిక రాందాస్ చౌరస్తాలో దహనం చేశారు. భాను ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులంతా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న సందర్భంలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి కొన్ని అధికార దాహం కోసం అలాగే రాజకీయ పార్టీ నాయకుల అండదండలతో పరీక్ష పేపర్‌ని లీక్ చేసినట్టు స్పష్టంగా అర్థం అవుతుందని ఆరోపించారు. జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకొని వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి ఉదయ్, కార్యకర్తలు భరత్, అశోక్, సందీప్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

# అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి


ధర్నా చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో అర్హులైనవారికి వెంటనే రెండు పడకల ఇళ్లు మంజూరు చేయాలనే డిమాండ్‌తో బీజేపీ కార్యకర్తలు గురువారం రామాయంపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించిన కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు వెంటనే రెండు పడకల ఇళ్లు మంజూరు చేయకపోవడంతో వారు ఇబ్బందులపాలవుతున్నారని వాపోయారు. ఈ విషయమై ప్రభుత్వం పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఇకనైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆందోళనలో పార్టీ ఓబీసీ మోర్చా పట్టణాధ్యక్షుడు కటిక కార్తీక్, మైనారిటీ పట్టణాధ్యక్షుడు జహీర్, కిసాన్ మోర్చా పట్టణాధ్యక్షుడు పాతూరి సిద్ధరాంలు, పట్టణ ఉపాధ్యక్షుడు సతీశ్ రావు, ప్రధాన కార్యదర్శి నిమ్మల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలని సీపీఎం జిల్లా అధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. గురువారం చేగుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్రీనివాస్‌ను కలిసి అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని కోరగా, లబ్ధిదారుల జాబితాను ఆమెకు అందించారు.

# ప్రమాద బీమా చెక్కుల పంపిణీ

నిజాంపేట(మెదక్): ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు రూ.2 లక్షల ప్రమాద బీమా అందించనున్నట్లు ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం మెదక్ నియోజకవర్గంలోని నిజాంపేట గ్రామానికి చెందిన దండు కనకయ్య, శంకరంపేట్ ఆర్ మండలం ధర్పల్లికి చెందిన వీరయ్యగారి ప్రతాప్‌రెడ్డి, హవేళిఘనాపూర్ మండలంలోని బ్యాతోల్ గ్రామానికి చెందిన కమ్మరి రమేశ్, మండలంలోని మల్కాపూర్ తండాకు చెందిన దేవసోత్ భాస్కర్ ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.8లక్షల చెక్కులను ఇఫ్కో డైరెక్టర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిజాంపేట సర్పంచ్ అనూష, పార్టీ అధ్యక్షుడు సీహెచ్ నాగరాజు, కల్వకుంట పీఏసీఎస్ చైర్మన్ అందె. కొండల్ రెడ్డి, నాయకులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలకు చెక్కులను అందిస్తున్న దృశ్యం

# కరెంట్ కోతతో ఎండుతున్న పంటలు


ఇబ్రహీంబాద్‌లో పశువుల మేత కోసం కోసిన ఎండిన వరి పంట

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఇబ్రహీంబాద్‌తో పాటు తదితర గ్రామాల్లో కరెంట్ కోతలతో బోరుబావుల కింద సాగు చేస్తున్న వరి పంట ఎండుతోంది. నిరంతరం కరెంట్ ఉంటుందన్న ఆశతో రైతులు బోరుబావుల వద్ద వరి పంటలు సాగు చేశారు. కరెంట్ కోతల కారణంగా ప్రస్తుతం వరి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో పంటను పశువుల మేతకు వినియోగిస్తున్నారు. అప్పులు చేసి పంట పండిస్తే.. పెట్టుబడి కూడా చేతికి రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు


పావుల వడ్డీ చెక్కులను అందిస్తున్న ఎంపీపీ వెంకట నర్సింగరావు

నర్సాపూర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని నర్సాపూర్ ఎంపీపీ వెంకట నర్సింగరావు అన్నారు. గురువారం మండలంలోని చిన్న చింతకుంటలో మహిళా సంఘాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న చింతకుంట గ్రామంలోని 43 మహిళా సంఘాలకు రూ 19 లక్షల, 87వేలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేశ్‌గౌడ్, ఏపీఎం గౌరీ శంకర్, సిబ్బంది శైలజ, శివలక్ష్మి, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ రుణ పత్రాల పంపిణీ


పత్రాలను అందిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెంలో గురువారం సర్పంచ్ వెంకటేశ్వర్లు డ్వాక్రా మహిళలకు రుణాలకు సంబంధించిన వడ్డీ చెల్లింపు పత్రాలను అందజేశారు. గ్రామంలోని 12 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ. 5లక్షల 86 వేల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ రేణుకుమార్, సీసీ శోభరాణి, కార్యదర్శి నందిని, మహిళా సమైఖ్య సంఘం సీఏ పెంటమ్మ, వార్డు సభ్యురాలు పెంటమ్మ, భవాని, పద్మ, సభ్యులు ఆంజనేయులు, శ్రీనివాస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా సామగ్రి పంపిణీ


క్రీడా సామగ్రి అందిస్తున్న హెచ్‌ఎం శివప్రసాద్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల నిధుల నుంచి కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని అందించారు. గురువారం సూరారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం శివప్రసాద్, ఎస్‌ఎంసీ సభ్యులు అక్బర్ చేతుల మీదుగా స్పోర్ట్స్ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులకు రూ.5 వేలు, జెడ్పీపాఠశాల విద్యార్థులకు రూ.10 వేలు ప్రభుత్వ నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులున్నారు.

## క్లుప్తంగా

### రామాయంపేటలో తైబజార్ వేలంపాట


తైబజార్ వేలంపాటలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కౌన్సిలర్లు, కమిషనర్

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం తైబజార్ వేలంపాట నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈవేలంపాట కొనసాగింది. పట్టణానికి చెందిన దేవుని రాజు రూ. 14.80 లక్షలకు తైబజార్ టెండర్‌ను కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో కమిషనర్ ఉమాదేవి, మేనేజర్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు దేమె యాదగిరి, సుందర్‌సింగ్, చిలుక గంగాధర్, ఇతర నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ‘కంటివెలుగు’ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): అంధత్వ నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు శిబిరాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ అన్నారు. మాసాయిపేట మండలంలోని నాగ్సాన్‌పల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటయ్య, ఎంపీటీసీ నవనీత శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కనుల పండువగా ధనలక్ష్మి జాతర


విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన ధనలక్ష్మి అమ్మవారి జాతర కనుల పండువగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో రెండో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం పోతరాజు గావు, బండ్ల ఊరేగింపు వివిధ పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త ఇసుగారి చిన్న నర్సయ్య తెలిపారు.

### సన్మానం


ఆదర్శరైతును సన్మానిస్తున్న గ్రామస్తులు, యువజనం సంఘం సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): పంటమార్పిడి, కూరగాయల సాగులో ఆదర్శంగా నిలిచిన బాన్సువాడకు చెందిన రైతు మహిపాల్‌రెడ్డిని గ్రామస్తులు, యువజన సంఘం సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. మండలంలోని డాక్టర్ రామానాయుడు వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయక్ ఉత్తమ రైతు మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డిని సన్మానించిన విషయం విధితమే. దీంతో గ్రామ పంచాయతీలో మహిపాల్‌రెడ్డిని గ్రామస్తులు, యువకులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ రైతుబంధు అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ ఫారుఖ్, సొసైటీ మాజీ డైరెక్టర్ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, గ్రామస్తులు కుత్‌బొద్దీన్, భూపాల్ రెడ్డి, యాదుల్, పోచయ్య, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్మకు పాల్పడిన బాధిత కుటుంబానికి దాతలు గురువారం ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన బండి ఎల్లం మూడు రోజుల క్రితం ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్సకోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే బీఆర్ఎస్ మండల కోశాధికారి బండారి గంగాధర్ మృతుడి కుటుంబానికి రూ.5 వేలు నగదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివ, నాయకులు శంకర్, అనంద్, మహేశ్ తదితరులు ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ ఆహ్వానం



రామాయంపేట(మెదక్): ఈనెల 17 నుంచి రెండు రోజల పాటు కొనసాగనున్న పెద్దమ్మ ఉత్సవాలకు హాజరుకావాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు గురువారం శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. అంతకుముందు వారు నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయకుమార్‌ను కలిసి పత్రిక అందజేశారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పుట్టి అక్షయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రాంకిష్టయ్య, రామాయంపేట మండల అధ్యక్షుడు ఎర్రం ఆంజేయులు, నాయకులు రొయ్యల పోచయ్య, కిషన్, నర్సింలు, కిషన్, స్వామి, అక్కల సిద్ధరాంలు ఉన్నారు.

◆ అభివృద్ధి పనుల పరిశీలన

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ గురువారం ఉదయం పర్యటించారు. పలు వార్డుల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయా వార్డుల్లో కొనసాగుతున్న పలు సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణ పనులు పరిశీలించి, నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్లకు సూచించారు. శివాలయం వీధిలో ప్రజలతో మాట్లాడుతూ.. కోతుల నుంచి ఎవరికి వారు ఎలా రక్షించుకోవాలనే అంశంపై వారికి అవగాహన కల్పించారు.

◆ పరీక్ష సామగ్రి అందజేత



నర్సాపూర్‌రూరల్: మండలంలోని పెద్దచింతకుంట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శ్రీరామ్ లైఫ్‌ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. గురువారం ఏజీఎం రాఘవేందర్‌రావు, ఇన్సూరెన్స్ అడ్వైజర్ సాయిప్రసాద్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెదక్ బ్రాంచ్ మేనేజర్ రత్నాకర్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ సామూహిక సీమంతం



చిన్నశంకరంపేట(మెదక్): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన బిడ్డలకు జన్మనిస్తారని మండలంలోని సూరారం గ్రామ సర్పంచ్ నీరజ అన్నారు. గురువారం మండలంలోని సూరారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీశైల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరం

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


చిలప్‌చెడ్(నర్సాపూర్): చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


రామాయంపేట(మెదక్): చెక్కును అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్


కౌడిపల్లి(నర్సాపూర్): ఆదర్శరైతు మహిపాల్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరంగా మారుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. చిలప్‌చెడ్‌లోని రైతువేదిక భవనంలో అర్హులైన 40మంది ఆడపిల్లల వివాహాలకు మంజూరైన చెక్కులను గురువారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోదరెడ్డి, తహసీల్దార్ ముసాద్దిక్, ఎంపీడీఓ శశిప్రభ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి, పార్టీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): పట్టణానికి చెందిన షేక్ సోనూ అనే యువతికి మంజూరైన షాదీ ముబారక్ చెక్కును గురువారం మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్ మన్నాన్, మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, కౌన్సిలర్ దేమె యాదగిరి, నాయకులు కొండల్ రెడ్డి, రాజు, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని 36మంది లబ్ధిదారులకు నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహ్మద్‌నగర్‌కు చెందిన ఆదర్శరైతు మహిపాల్‌రెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తారబాయ్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ కవితఅమర్‌సింగ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మండలాఅధ్యక్షుడు రమాగౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎల్లం, నరహరి, లక్ష్యనాయక్, రాజేందర్, నాయకులు నర్సింగారావు, మహిపాల్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, మోహన్, వీరయ్య, మనోహర్‌రెడ్డి, అమర్‌సింగ్, శ్రీనివాస్‌గౌడ్, దూద్యనాయక్, సత్తయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పనులు చేస్తే బిల్లులు ఇవ్వరా?


అల్లాదుర్గం కాన్సీరాంనగర్ పాఠశాలలో నిర్మించిన మూత్రశాలలు

● ఎస్‌ఎంసీ చైర్మన్ రమేశ్ ఆవేదన

అల్లాదుర్గం(మెదక్): మన ఊరు – మన బడి పథకం కింద పనులు చేస్తే వెంటనే బిల్లులు చెల్లిస్తామని, అడ్వాన్స్‌గా లక్ష రూపాయలు తీసుకోవచ్చని చెప్పిన అధికారులు, పనులు చేస్తే బిల్లులు ఇవ్వకపోగా రికార్డులు చేయకుండా వేధిస్తున్నారని అల్లాదుర్గం కాన్షీరాంనగర్ ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యుత్, మూత్రశాలలు, నీటి సౌకర్యం, పాఠశాల మైనర్ రిపేర్ పనులు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు సుమారు ఐదు లక్షల రూపాయల పైనే పనులు చేస్తే కేవలం విద్యుత్ బిల్లు 76 వేల రూపాయలు మాత్రమే ఇచ్చినట్లు చెప్పారు. ఇంతకు ముందు ఉన్న ఏఈ చూశారని చెబితే ఆయన వద్దకే వెళ్లి రికార్డులు చేసుకో అంటూ దురుసుగా మాట్లాడుతన్నారని రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. పనులు చేసినప్పుడు చూసిన హెచ్‌ఎం తనకేమి తెలియదని చెప్పాడమేమిటని ప్రశ్నించారు. పర్సంటేజీల కోసమే వేధిస్తున్నారని, ఈవిషయంపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి న్యాయం చేయాలని ఎస్‌ఎంసీ చైర్మన్ కోరారు.


పాఠశాలలో ఏర్పాటు చేసిన ట్యాంకులు

# మానసిక సమస్యలను తొలిదశలో గుర్తించాలి


మాట్లాడుతున్న జగదీశ్

శివ్వంపేట(నర్సాపూర్): పిల్లల మానసిక సమస్యలను తొలిదశలో గుర్తించాలని అపోలో విజ్ఞాన సంస్థ న్యూరో డెవలప్‌మెంటల్ హెల్త్ సెంటర్ విభాగాధిపతి డాక్టర్ జగదీశ్ అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లలతో పిల్లల్లో న్యూకోలాజికల్ సమస్యలు – నివారణ అంశంపై శివ్వంపేటలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిదశలో సమస్యను గుర్తించడం వల్ల త్వరగా తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పిల్లల వికాసంలో తొలి 1000 రోజులు అత్యంత కీలకమైనవి అన్నారు. సమన్వయకర్త సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. జిల్లా విద్యాధికారి రాధకిషన్ సూచనలు ప్రకారం జిల్లాలోని శివ్వంపేట, వెల్దుర్తి, తూప్రాన్, మాసాయిపేట, నర్సాపూర్, మనోహరాబాదు మండలాల్లో విద్యాశాఖ, అపోలో వైద్య విజ్ఞాన సంస్థ సంయుక్తంగా న్యూరోలాజికల్ సమస్యలపై ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారి బ్రహ్మాజీ, ఎంఈఓ బుచ్చానాయక్ తదితరులు ఉన్నారు.

## విజేతలకు జ్ఞాపికల అందజేత

రామాయంపేట(మెదక్): ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ట్యాలెంట్ టెస్టులో ప్రతిభ చూపిన గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం తహసీల్దార్ అబ్దుల్ మన్నాన్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సరళాదేవి చేతులమీదుగా జ్ఞాపికలు అందజేశారు. ట్యాలెంట్ టెస్టులో మండలస్థాయిలో ప్రథమ బహుమతిని రెసిడెన్సియల్ విద్యార్థిని అలోక్య, ద్వితీయ బహుమతిని అశ్విని, తృతీయ బహుమతిని భవ్యశ్రీ గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా బాధ్యులు జగన్, సంఘం మండల అధ్యక్షుడు సంజీవ్, జిల్లా నాయకుడు నవీన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జ్ఞాపిక అందిస్తున్న తహసీల్దార్

# సమస్యలను త్వరగా పరిష్కరించండి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించటంలో అధికారులు విఫలమవుతున్నారని, పెండింగ్ పనులకు బిల్లులు చెల్లించడంతో పాటు సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యుడు డిమాండ్ చేశారు. చిలప్‌చెడ్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షురాలు వినోద దుర్గారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో భాగంగా ఆయా శాఖల అధికారులు వారి నివేదికలను సభకు వివరించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరీ కావటంలేవని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని సర్పంచ్‌లు లక్ష్మి, అశోక్‌రెడ్డిలు సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న వర్కర్లకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్‌లకు ఈఎంఐలు కట్టలేకపోతున్నామని, ప్రభుత్వం మరిన్ని నిధులను గ్రామ పంచాయతీలకు కేటాయించాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. భద్రయ్య తండాలో భగీరథ నీరు రావటం లేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ బుజ్జిబాయ్ సభకు వివరించారు. నీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని డీఈఈ కిషన్‌ను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేలా నిధులు కేటాయిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 84 నూతన గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలకు నిధులు మంజూరీ అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోద, ఎంపీడీఓ శశిప్రభ, తహసీల్దార్ ముసాద్దిక్, వైస్ ఎంపీపీ విశ్వంభస్వామి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి